క్లుప్తంగా

ఎమ్మార్ఐటీఎస్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్ఐటీఎస్ కళాశాలలో ఈసీఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఉద్దగిరి రవికుమార్‌కు హైదరాబాద్ ఐఐఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి డాక్టరేట్ దక్కింది. రవికుమార్ ఇంప్లిసిట్ ఇండియన్ లాంగ్వేజ్ ఐడెంటిఫికేషన్ యూసింగ్ డిఫరెంట్ డీప్ న్యూరల్ నెట్వర్క్ ఆర్కిటెక్చర్స్ అంశంపై ఐఐఐటీ ప్రొఫెసర్ ఉప్పాల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సమర్పించిన గ్రంథానికి పరిశీలక బృందం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఎమ్మార్ఐటీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్ర, అధ్యాపకులు ఆయనను సన్మానించారు.

చలివేంద్రం ప్రారంభం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు ఎస్వీనగర్ మెయిన్‌రోడ్డు హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో కౌన్సిలర్ కొకుట్ల మమతకృష్ణారెడ్డి సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కొకుట్ల మమత కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఇక్కడ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కాగా వేసవిలో పెద్దలు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు వీరారెడ్డి, రాజు, బీఎస్.రెడ్డి, పోతరాజు, రాంరెడ్డి, సతీష్‌బాబు, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణరాజు, రమణారెడ్డి, నికేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడిగా విఠల్

మేడ్చల్: బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడిగా మేడ్చల్‌కు చెందిన విఠల్ నియమితులయ్యారు. విఠల్‌ను ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రాన్ని అందజేశారు. విఠల్ ఉద్యమకారుడిగా పార్టీ ఆవిర్భావం నుంచి బీఆర్ఎస్‌లో పని చేస్తున్నాడు. పార్టీ పటిష్టత కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు.

కేఎల్ఆర్ కమాన్ వద్ద హైమాస్ట్ లైట్లు

మేడ్చల్: పట్టణంలోని 3వ వార్డు పరిధిలో కేఎల్ఆర్ కమాన్ వద్ద కౌన్సిలర్ జాకట దేవరాజ్ హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. చౌరస్తా వద్ద రాత్రి వేళ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అందుకోసమే హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు కౌన్సిలర్ తెలిపారు. వార్డులోని ప్రతి సమస్యను పరిష్కరించడంతో పాటు మౌలిక సదుపాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ఘట్‌కేసర్: పట్టణంలోని శివారెడ్డిగూడ శ్రీప్రసన్న వీరాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో స్థానిక నేత కొంతం రాంరెడ్డి సుగుణ దంపతులు ఆయన తండ్రి దివంగత బాల్‌రెడ్డి జ్ఞాపకార్థం సోమవారం పేదలకు దుస్తులను అందజేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రైతు బంధు మండల కో ఆర్డినేటర్ అంజిరెడ్డి, నరసింహారెడ్డి, కష్టారెడ్డి, కోటేశ్వర్‌రావు, ఓంకార్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడ్చల్‌రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం చత్తీస్‌ఘడ్‌కు చెందిన సుఖీరాం(25) బతుకుదెరువుకు మేడ్చల్‌కు వలస వచ్చి పట్టణంలో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి మేడ్చల్ పట్టణంలోని ఏడుగుళ్ల సమీపంలో 44వ జాతీయ రహదారి దాటుతుండగా అదే సమయంలో తూప్రాన్ నుంచి నగరం వైపు వెళ్తున్న లారీ వేగంగా అతడిని ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

యాజమాని ఇంటికే కన్నం వేసిన డ్రైవర్

మేడ్చల్‌రూరల్: యజమానులు ఇంటికి తాళం వేసి ఊరెళ్లారన్న విషయం గమనించిన కారు డ్రైవర్ 11 తులాల బంగారం అపహరించిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. గౌడవెల్లి గ్రామ పరిధిలో సాకేత్ విల్లాస్‌లో నివాసముంటున్న రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి సుధాకర్ 6వ తేదీన భార్య రాజేశ్వరితో కలిసి ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. విషయం గమనించిన కారు డ్రైవర్ రమేశ్ ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోని 11 తులాల బంగారు ఆభరణాలను దొంగిలించాడు. సుధాకర్ ఆదివారం ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉండటం కనిపించింది. బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కారు డ్రైవర్ రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. దొంగిలించిన ఆభరణాలను ఇంటి పరిసరాల్లో భూమిలో పాతిపెట్టినట్లు తెలపగా పోలీసులు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కార్డు జాడేదీ..?

దరఖాస్తులకే పరిమితమైన ఆహార భద్రత కార్డుల జారీ ప్రక్రియ

- కొత్త కార్డుల కోసం తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ
- ఏళ్లు గడుస్తున్నా.. కార్డుల మంజూరులో తీవ్ర జాప్యం
- మ్యుటేషన్ల దరఖాస్తులను పట్టించుకునే వారే కరువు
- పెండింగ్‌లో 69,326 మ్యుటేషన్ల దరఖాస్తులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఆహార భద్రత కార్డుల జారీ ప్రక్రియ కేవలం దరఖాస్తులకే పరిమితమైంది. దరఖాస్తులు చేసి ఏళ్లు గడుస్తున్నా.. కార్డుల మంజూరులో తీవ్ర జాప్యంతో దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఆసరా పింఛన్లు, ఆరోగ్యశ్రీ, కల్యాణ లక్ష్మీ, ఉపకారవేతనాల మంజూరు, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి దరఖాస్తులకు ఆహార భద్రత కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో కొత్త కార్డుల మంజూరు లేక.. అర్హత ఉన్నా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని దుస్థితి ఏర్పడింది.

దరఖాస్తుదారుల నిరీక్షణ

జిల్లాలో 15 మండలాలకుగాను 5,23,842 ఆహార భద్రత కార్డులు ఉండగా వాటిలోని 17,24,481 మంది సభ్యులకు ప్రతినెలా ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. కార్డులో ఎంత మంది ఉంటే.. అంత మందికి పరిమితి లేకుండా ప్రతినెలా 6 కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు కార్డుకు 35 కిలోల వంతున బియ్యం పంపిణీ చేస్తోంది. కొత్తగా వివాహం చేసుకున్న వారు భార్యాభర్తలు పాత కార్డుల్లో తమ పేర్లను తొలగించుకొని నూతన కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. పాత కార్డుల్లోంచి దరఖాస్తుదారుల పేర్లను తక్షణం తొలగించిన అధికారులు నూతన కార్డులు మంజూరు చేయకపోవడంతో వారి పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. పిల్లలు పుట్టాక వారి పేర్లను రేషన్ కార్డుల్లో చేర్చడానికి దరఖాస్తు చేసుకుంటున్న వారికి నిరాశే ఎదురవుతోంది. గతంలో 95,040 దరఖాస్తులు రాగా, వాటిలో సుమారు 985 కార్డులను మాత్రమే మంజూరు చేసి సంబంధిత అధికారులు చేతులు దులుపుకున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా మ్యుటేషన్ల(చేర్పులు, మార్పుల) కోసం పెట్టుకున్న 69,326 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే అపరిష్కృతంగా ఉన్నాయి. ప్రస్తుతం మీ సేవ కేంద్రాల్లో నూతన కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియ అందుబాటులో లేకపోవడంతో పలువురు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు.

వేగవంతం చేయాలి

మా అబ్బాయికి 5 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు రేషన్ కార్డులో పేరు నమోదు కోసం మీ సేవలో దరఖాస్తు చేశా. ఇప్పటికీ అతడి వయస్సు 8 సంవత్సరాలు, తహసీల్దార్ కార్యాలయంలో అడిగితే మా చేతిలో ఏమీ లేదు.. మేము పరిశీలన జరిపి సంబంధిత అధికారులకు పంపించామని చెబుతున్నారు. అర్హులకు ఆహార భద్రత కార్డు అందేలా కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలి.

– బి.కిరణ్‌రెడ్డి, బోడుప్పల్

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా..

మండలాల వారీగా అర్హులైన వారితో జాబితా సిద్ధంగా ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే నూతన ఆహార భద్రత కార్డులు మంజూరు చేస్తాం. ప్రభుత్వం ప్రస్తుతం కొత్త రేషన్ కార్డు దరఖాస్తు ప్రక్రియను నిలిపివేసింది. సవరణ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

– తనుజా, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

ఓబీసీలకు పెద్దపీట వేస్తున్న కేంద్ర ప్రభుత్వం

బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు



అవుషాపూర్‌లో ప్రచారం చేస్తున్న ప్రవీణ్‌రావు, సత్యనారాయణ, ఓబీసీ నేతలు

ఘట్‌కేసర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓబీసీలకు పెద్దపీట వేస్తోందని, కేంద్ర ప్రభుత్వం ఏకంగా 27 మంది ఓబీసీలకు మంత్రి పదవులు కట్టబెట్టిందని బీజేపీ మండల అధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు అన్నారు. ఓబీసీ రాష్ట్ర పిలుపు మేరకు ఆ సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం అవుషాపూర్‌లో నిర్వహించిన పల్లెపల్లెకు ఓబీసీ–ఇంటింటికీ బీజేపీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కరపత్రాలతో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఆయుష్మాన్ భారత్‌తో ఆరోగ్య భద్రత, నీట్‌లో 27 శాతం రిజర్వేషన్లు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, ఉపాధ్యక్షుడు వేమారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, బూత్ అధ్యక్షుడు రాజా రామోజీ, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, బాలుయాదవ్, సాయిలు, వెంకటేశ్, సురేశ్, జీవన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులపై దృష్టి పెట్టాలి

జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో ప్రజలందించిన 89 ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై ప్రజావాణిలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మేడిపల్లి గౌడ సంఘానికి చెంగిచర్ల సర్వే నంబర్–48లో గతంలో కేటాయించిన ఐదు ఎకరాల భూమిని తాటి, ఈత వనాన్ని పెంచుకునేందుకు అందజేయాలని సంబంధిత అధికారులకు వినతి పత్రం సమర్పించారు. అలాగే, మిస్సింగ్ సర్వే నంబర్లు, భూవిస్తీర్ణంలో తేడాలు, భూమి రకంలో తేడాలు, నిషేధిత జాబితా నుంచి తొలగించడం, పట్టా భూమి అసైన్డ్ భూములుగా నమోదవడం వంటి సమస్యలపై పలువురు జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలపై కూడా వినతులు సమర్పించారు. కార్యక్రమంలో డీఆర్ఓ లిగ్యానాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తూ..

కీసర: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని బీఆర్ఎస్ కీసర మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి అన్నారు. కీసర గ్రామానికి చెందిన ముద్దం మల్లేష్‌యాదవ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.42,500ల చెక్కును సోమవారం ఆయన లబ్ధిదారుడికి అందజేశారు. అనంతరం కీసర గ్రామంలో ఇటీవల మృతి చెందిన శివాజీనగర్‌కాలనీకి చెందిన పిట్టల విఠల్ కుటుంబసభ్యులను పరామర్శించిన సుధాకర్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు చినింగని బాల్‌రాజ్, రాగుల గణేష్, సుమన్ బన్నీ, మెట్టు పరమేష్, మహేష్‌ముదిరాజ్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం

కీసర: ఆపదలో ఉన్న పేదలను ఆదుకునేందుకు బీఆర్ఎస్ నేత గుర్రం శ్రీధర్‌రెడ్డి ఎప్పుడు ముందంజలో ఉంటున్నాడని బీఆర్ఎస్ నేత సుమన్ బన్ని అన్నాడు. సోమవారం కీసర గ్రామంలో ఇటీవల మృతి చెందిన పిట్టల విట్టల్ కుటుంబసభ్యులకు గుర్రం శ్రీధర్‌రెడ్డి అందజేసిన రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశాడు. కార్యక్రమంలో నేతలు రాము తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు భరోసా

శామీర్‌పేట్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం ఆద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారుడు జీడీ సతీష్‌కు రూ.45 వేల చెక్కును మంత్రి అందజేశారు. రాష్ట్రంలోని పేదలకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని అన్నారు. నాయకులు నర్సింహ, భూపాల్, సంజీవ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో సీపీఆర్‌పై శిక్షణ

పోచారం: నారపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలతో పాటు ఆశా వర్కర్లకు కార్డియో పల్మనరీ రిససిటేషన్(సీపీఆర్)పై వైద్యాధికారి శోభన ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ శిబిరం నిర్వహించారు. ఆకస్మికంగా గుండె పోటుకు గురైన రోగులను కార్డియో పల్మనరీ పునరుజ్జీవ ప్రక్రియతో ఎలా కాపాడాలో కార్యకర్తలకు వైద్యులు వివరించారు.

నేడు కలెక్టరేట్‌లో జ్యోతిబాపూలే జయంతి

సాక్షి, మేడ్చల్‌జిల్లా: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 11గంటలకు కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి టి.ఝాన్సీరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొంటారన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

స్వచ్ఛ గ్రామాల కోసం కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రజితరెడ్డి

మేడ్చల్: మండలంలోని అన్ని గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా మార్చేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కృషి చేయాలని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ భారత్ మిషన్ ఫేజ్–2పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. గ్రామాల్లో స్వచ్ఛత సాధించేందుకు పూర్తిగా ప్లాస్టిక్ నిషేధం, తడిపొడి చెత్త సేకరణ, మురుగు కాలువల నిర్వహణ, అంశాలపై దృష్టి సారించాలని అన్నారు. శిక్షణలో అధికారులు, పాలకులు సూచనలు, సలహాలను గ్రామాల్లో పాటించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ శైలజవిజయానంద్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీఓ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులపై ఆరా



మురుగు కాల్వలను పరిశీలిస్తున్న సర్పంచ్ మాధురి తదితరులు

కీసర: కీసర గ్రామ పంచాయతీ పరిధిలోని 11వ వార్డు ఎస్సీకాలనీలో పంచాయతీ నిధులతో చేపడుతున్న భూగర్భ మురుగు కాలువ నిర్మాణ పనులను సోమవారం గ్రామసర్పంచ్ నాయకపు మాధురివెంకటేష్, ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్ పరిశీలించారు. త్వరగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అనంతరం కీసరలోని శివాజీనగర్‌కాలనీ సమీపంలో కాలనీలో పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. వార్డు సభ్యులు ముద్దం వెంకటేష్, నేతలు శీలం మల్లేష్, రమేష్, అశోక్, పరమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

అందరికీ గృహలక్ష్మీ పథకం అమలు చేస్తాం



పట్టాలు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: రాష్ట్రంలోని పేదలందరికీ గృహలక్ష్మీ పథకం వర్తింపజేస్తామని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్‌లో జీఓ 58 లబ్ధిదారులకు ఆయన పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 నుంచి 120 గజాల స్థలం ఉన్న వారికి గృహలక్ష్మీ పథకం ద్వారా ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.3 లక్షలు మంజూరు చేస్తోందని అన్నారు. పేదలందరికీ ఇళ్లు ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పథకం చేపట్టిందని అన్నారు. మేడ్చల్ మండలంలోని 134 మందికి, మున్సిపాలిటీని 21మందికి లబ్ధిదారులకు ఆయన పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయానంద్‌రెడ్డి, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు నందారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రాల లీకులపై యూత్ కాంగ్రెస్ నిరసన



ఘట్‌కేసర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసనలో యూత్ కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్: రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి ప్రశ్నాపత్రాల లీక్‌పై యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట సోమవారం యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షుడు సుశాంత్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి రుక్‌వర్ధన్‌రెడ్డి, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, దమ్మాయిగూడ అధ్యక్షుడు సుమేశ్, జవహరనగర్ అధ్యక్షుడు వినయ్, పోచారం అధ్యక్షుడు యుగేందర్, మేడ్చల్ అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు బీరప్ప, సాయిరాంరెడ్డి, మహేశ్, సాయి, సాయిచరణ్, సాయికుమార్, కృష్ణ పాల్గొన్నారు.

గౌడవెల్లిని అభివృద్ధి చేస్తున్నాం



మాట్లాడుతున్న సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని గ్రామ సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ అన్నారు. పంచాయతీ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా మార్చడానికి ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. గ్రామంలో ప్రతి సమస్యను పరిష్కరిస్తూ పాలకవర్గం ప్రజలకు అండగా నిలిచిందని అన్నారు. దాతల సహకారంతో పక్కా భవనాలు నిర్మించామని తెలిపారు. సమావేశంలో ఉపసర్పంచ్ పెటమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులు పోరాట పటిమ కలిగి ఉండాలి

విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి



వీబీఐటీ వాలీబాల్ క్రీడాకారులతో మనోహర్‌రెడ్డి

ఘట్‌కేసర్: క్రీడాకారులు పోరాట పటిమ కలిగి ఉండాలని విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల(వీబీఐటీ) కార్యదర్శి డాక్టర్ మనోహర్‌రెడ్డి అన్నారు. బాచుపల్లి వీఎన్ఆర్ వీజేఐటీలో ఇటీవల నిర్వహించిన ఆలిండియా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో ప్రథమ స్థానం సాధించిన వీబీఐటీ క్రీడాకారులకు ఆ కళాశాలలో సోమవారం నిర్వహించిన అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పీవీఎస్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, వివలాల్, విశ్వాస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



దమ్మాయిగూడ 10వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తూ..

కీసర: కంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతగౌడ్ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులోని సిద్ధార్థనగర్‌లోని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ వద్ద ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్‌స్వామి, కౌన్సిలర్ ముప్పశ్రీలతరామారావు, కాలనీవాసులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు. 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 21 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. నాగారం మున్సిపల్ పరిధిలోని 106 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 13 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామని, ఐదుగురిని కంటి ఆపరేషన్ల కోసం రిఫర్ చేసినట్లు తెలిపారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

- కీసర భూదాన్ భూములను రక్షించండి
- కలెక్టరేట్ ఎదుట సీపీఐ ధర్నా

సాక్షి, మేడ్చల్‌జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కీసర సర్వే నంబర్ 179, 180, 213లోని భూదాన భూములను భూకబ్జాదారులు ఆక్రమిస్తున్నా.. రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలమల్లేష్ తీవ్రంగా విమర్శించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ భూదాన్ భూములను పరిరక్షించి, పేదలకు కేటాయించి, ప్రభుత్వమే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూదాన్‌తో సహా ప్రభుత్వ, అసైన్డ్ భూములను రాజకీయ అండదండలతో భూకబ్జాదారులు ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, నిరుపేదలు గుడిసెలు వేసుకుంటే మాత్రం పోలీసు బలగాలతో తొలగించి, అరెస్టులు చేయించటం పరిపాటిగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం భూదాన్ భూములను భూకబ్జాదారుల నుంచి రక్షించకుండా రాజకీయ నాయకులు వత్తాసు పలికే చర్యలకు పూనుకుంటే.. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం చూస్తూ ఊర్కోదని, నిరుపేద ప్రజలను సమీకరించి కాపాడతామని ఆయన హెచ్చరించారు. సొంత ఇళ్లు లేని నిరుపేదలు జిల్లాలో వేలాదిగా ఉన్నారని, వారందరూ ఇళ్ల స్థలాల కోసం ఉద్యమించేందుకు సిద్ధమవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శంకర్, నాయకులు కిషన్, మహాలక్ష్మి, స్వరూప, ఐలయ్య, యాదయ్యగౌడ్, యాదగిరి, రాజేశ్వరి, లక్ష్మణ్, రవి, మహేష్ పాల్గొన్నారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డికి సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు అందజేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు